

తుర్కయంజాల్ మున్సిపాలిటీ సూరజ్‌నగర్ ఫేజ్-3లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

హయత్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ సూరజ్‌నగర్‌కాలనీ ఫేజ్-3లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్నివిధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో నంబర్-1గా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కొశిక ఐలయ్య, కుంట గోపాల్‌రెడ్డి, దర్శన్, విజయానంద రెడ్డి, ధన్‌రాజ్, సామ భీంరెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.



మహంకాళమ్మతోటలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

ఓపెన్ జిమ్ ప్రారంభం

చంపాపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ మహంకాళమ్మతోటలో జీహెచ్ఎంసీ నిధులు 9.50లక్షలతో చేపట్టిన ఓపెన్‌జిమ్‌ను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు స్థానికంగానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందు కోసం జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగిరాజ్, గాజుల శేఖర్, అంజి, బస్తీవాసులు వినీష్, వెంకటేశ్, అమన్‌సింగ్, శ్రీశైలం, దశరథ్, చంద్రశేఖర్, జగన్‌సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పగడాల యాదయ్య

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నేడు ప్రదర్శన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీలో సీపీఐ(ఎం) హయత్‌నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పగాల యాదయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేలా ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం ఇందిరాపార్కు సమీపంలో గల ధర్నాచౌక్ వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్నామని, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, సభ్యులు బి.భాస్కర్, సీహెచ్ కృష్ణయ్య, సీహెచ్ మల్లేశం, సంధ్య, కనకయ్య, శాంతికుమార్, రాజు, శ్రీనివాస్, మూర్తి, నర్సింహ పాల్గొన్నారు.



కులగణన రీ సర్వే చేయించాలని నిరసన వ్యక్తం చేస్తున్న చామకూర రాజు, ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కులగణనను రీ సర్వే చేయాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణనలో బీసీల లెక్కను సంపూర్ణంగా లెక్కించకుండా అణిచివేసే కుట్ర చేస్తున్నారని, రీ సర్వే నిర్వహించి బీసీ జనాభాను సంపూర్ణంగా లెక్కించాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. కుల గణన లెక్కలు తప్పుల తడకగా ఉందని ఆరోపిస్తూ ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆదివారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చామకూర రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బీసీ జనాభాను తగ్గించి రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం జరిగేలా ఉందని, ఈ అన్యాయాన్ని తిప్పికొట్టేందుకు బీసీ సమాజం మేల్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కులగణనలో తప్పుడు లెక్కలపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి అందేలా నాలుగు పేజీలతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేశారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్‌గౌడ్ మద్దతుగా నిలిచిన ఈ కార్యక్రమంలో ఎస్‌జేపీ స్పోక్స్ పర్సన్ కొండల్‌గౌడ్, చెన్న శ్రీకాంత్, బాలస్వామి, అనిల్ రజక, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, గోర శ్యాంసుందర్‌గౌడ్, మేడిగ శ్రీధర్, బోయపల్లి శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి

ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలుపర్చాలి

కొత్తపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలుపర్చాలని సీపీఐ, గిరిజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సమాఖ్య ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి సర్వసభ్య సమావేశం ఆదివారం న్యూనాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవన్‌లో జరిగింది. సమాఖ్య నాయకులు సక్రునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివనాయక్, కందు, సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శ్రీదేవి, సుధాకర్ మాట్లాడారు. పాలకవర్గాలు ఎస్టీ సబ్‌ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. బాలికల అమ్మకాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు కేటాయించిన నిధులను దారి మళ్లించకుండా గిరిజనుల అభివృద్ధికే వాడాలన్నారు. ప్రతినిధులు జైపాల్ నాయక్, సుశీల, శంకర్‌నాయక్, శోభ, కృష్ణ, రజిత, స్వప్న పాల్గొన్నారు.

కమ్మగూడలో ఘనంగా బాలయేసు మహోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవులు

హయత్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ బాలయేసు మహోత్సవం(ఊరిపండగా) ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 6గంటలకు నగరంలోని బోయిగూడ చర్చి నుంచి తేరు ప్రదక్షిణలో భాగంగా బాలయేసు విగ్రహాన్ని ఊరేగింపుకు కమ్మగూడకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ తాతిరెడ్డి జయరాజ్, మాదాను ఆరోగ్యస్వామితో పాటు కమ్మగూడకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు గ్రామస్థులు తేరుకు ఘనంగా స్వాగతం పలికారు. ఉదయం 9.30గంటలకు బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ ఇంగ్లిష్‌లో ఫాదర్ ఏరువ బాలశౌరెడ్డి చేశారు. ఉదయం 11.30గంటలకు బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజ తెలుగులో హైదరాబాద్ అతిమేత్రాణులు కాడినల్ పూల ఆంథోనీ చేశారు. మధ్యాహ్నం 2గంటలకు స్వస్థత ప్రార్థనలు విజయ్‌జోసఫ్ చేశారు. నాలుగు గంటలకు తేరుప్రదక్షణ, సాయంత్రం ఐదు గంటలకు దివ్య సత్ప్రసాద ఆశీర్వాదం అందించారు. పండగను పురస్కరించుకుని ఆర్టీసీ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కమ్మగూడ, తుర్కయంజాల్‌కు ప్రత్యేక బస్సులు నడిపించారు. వనస్థలిపురం పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. పండగకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. బాలయేసు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై చర్చిలోని బాలయేసు విగ్రహాన్ని దర్శించుకుని ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అతిమేత్రాణులు కార్డినల్ పూల ఆంథోనీ ఎమ్మెల్యేకు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్ సునీల్, కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, మాజీ కోఆప్షన్ సభ్యురాలు మరియమ్మ చిన్నయ్య, కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, కుంట గోపాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్‌తో పాటు పలువురు బాలయేసును దర్శించుకున్నారు.



బాలయేసు మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన క్రైస్తవులు



బోయిగూడ చర్చి నుంచి వచ్చిన తేరు ప్రదక్షిణకు స్వాగతం పలుకుతున్న కమ్మగూడ ప్రజలు, నాయకులు

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా గోవింద్



గోవింద్‌కు నియామకపత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బడంగ్‌పేట్‌కు చెందిన ముదావత్ గోవింద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన పార్టీ నాయకులకు గోవింద్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నర్సింహారెడ్డి సూచించారు.

స్థానిక సంస్థలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఒక్క పైసా ప్రత్యేక నిధులు ఇవ్వలేదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన ప్రత్యేక నిధులను రద్దు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆమె ఎద్దేవా చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లో గల గడ్డం ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీ కాలం కూడా ముగిసిందని, వాటికి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రత్యేకాధికారులను నియమించినా వారి నిధులు, విధులపై సైతం స్పష్టత లేదని సబితారెడ్డి విమర్శించారు. రైతుల భూములు లాక్కుంటున్నదంటూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వేలాది ఎకరాల రైతుల భూములను ఎందుకు తీసుకుంటున్నదని ఆమె ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆమె అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రామిడి కవితారాంరెడ్డి, ముత్యాల లలితాకృష్ణ, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు సమైక్యజ్యోతి, మాజీ కౌన్సిలర్ గుర్రం సాయి కిరణ్‌రెడ్డి, బీఆర్ఎస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, జక్కిడి ముత్యంరెడ్డి, ఇ.అశోక్, తుర్కయాంజాల్ రైతు సొసైటీ డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



గడ్డం ఎన్‌క్లేవ్‌లో సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం కాలనీవాసులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

కాలనీవాసులపై కబ్జాదారుల దాడి

- పార్కు స్థలాన్నీ ఆక్రమించారని ఆరోపణ
- పోలీసులకు పరస్పరం ఫిర్యాదు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కాలనీలోని పార్కు(ఖాళీ) స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిని అడ్డుకున్నందుకు కబ్జాదారులు కాలనీవాసులపైనే రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ శ్రీశక్తినగర్‌కాలనీలో 1979 నాటి లేఅవుట్ ప్రకారం 350 గజాల ఖాళీ స్థలం ఉంది. కాగా ఇటీవల కొందరు కబ్జాదారులు సదరు ఖాళీ స్థలానికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో శనివారం కబ్జాదారులు ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేయడానికి రాగా తాము అడ్డుకున్నామని, దాంతో కబ్జాదారులు తమను బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. దీనిపై తాము మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. తమ కాలనీలోని ఖాళీ స్థలాన్ని కాపాడడానికి మునిసిపల్ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా విషయం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు ఇరువర్గాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పరస్పరం ఫిర్యాదు అందజేశారని, సంఘటనపై విచారణ జరుపుతున్నామని పోలీసు తెలిపారు.



కాలనీవాసులపై దాడి చేస్తున్న కబ్జాదారులు

కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరిన వ్యక్తి మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యం అంటూ బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

హయత్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. దీంతో డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆదివారం ఉదయం బాధితుని కుటుంబ సభ్యులు, సీపీఎం, సీపీఐ నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్ మండలం పొల్కపల్లి గ్రామానికి చెందిన గజ్జి సత్యంగౌడ్(46) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్‌లోని శ్రీరాంనగర్‌కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. సత్యం తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. శనివారం సత్యంగౌడ్‌కు కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తుర్కయంజాల్‌లోని ఓ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో డాక్టర్లు రాత్రి అంతా చికిత్స అందించారు. తెల్లవారేసరికి సత్యంగౌడ్ మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని డాక్టర్లను నిలదీశారు. గుండెపోటు రావడం వల్ల చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న సీపీఎం, సీపీఐ నాయకులు ఓరుగంటి యాదయ్య, డి. కిషన్ అక్కడికి చేరుకుని బాధితులకు అండగా నిలబడ్డారు. ఆస్పత్రి యాజమాన్యం రాకపోవడంతో బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఆస్పత్రిలో బైఠాయించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సరైన డాక్టర్లు లేని ఆస్పత్రిని మూసివేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, సీపీఐ, సీపీఎం నాయకులు, మృతిచెందిన సత్యంగౌడ్(ఫైల్)

నేడు బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సీనియర్ నాయకులు క్యామ మల్లేష్, ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నందిహిల్స్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్: మీర్‌పేట్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకు ముందు గడిచిన రెండేళ్ల కాలానికి సంబంధించిన ఆడిట్ వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. కాలనీ అధ్యక్షుడిగా అర్థం శ్రీనివాస్‌గుప్తా, గౌరవాధ్యక్షుడిగా ఎం.దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్టు శేఖర్, కోశాధికారిగా డి.శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులుగా కె.వెంకన్న, కె.మహేందర్, సంయుక్త కార్యదర్శిగా ఎ.స్వాతిరెడ్డి, సంఘటన కార్యదర్శిగా జి.లక్ష్మణ్, సలహాదారులుగా జగన్మోహన్‌రావు, బాలరాజు, శంకర్, సభ్యులుగా శ్రీనివాస్, కిషోర్, శ్రావణ్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న రోజువారి కూలీ లారీని ఢీకొట్టి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంచల్‌గూడలోని ఫతేఖాన్‌బజార్‌లో నివాసముంటున్న సయ్యద్ నుస్రత్(48) రోజువారి కూలీ. ఆదివారం ఉదయం ఎల్బీనగర్‌లో ఐరన్ అన్‌లోడ్ చేసేందుకు యాక్టీవాపై మలక్‌పేట మీదుగా వెళ్తున్నాడు. తమిళనాడు నుంచి డ్రాయింగ్ పేపర్ లోడ్‌తో వస్తున్న లారీ మెట్రో పిల్లర్ నంబర్ 1432, 1433 మధ్యలో ఉన్న మలక్‌పేట మార్కెట్ గేట్‌లోకి వెళ్లేందుకు నిదానంగా ఎడమవైపు మలుపు తిరుగుతుంది. ఈ విషయాన్ని గమనించకుండానే యాక్టీవాపై వెళ్తున్న నుస్రత్ లారీ వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. దీంతో నుస్రత్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చాదర్‌ఘాట్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లా దామలవాడే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సుందరంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును చాదర్‌ఘాట్ ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు సయ్యద్ నుస్రత్

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి..

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హోటల్‌లో ఆకలి తీర్చుకుని చాదర్‌ఘాట్ చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా ఆదివారం ఉదయం మృతిచెందాడు. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై నివాసముంటున్న మహమూద్‌ఖాన్(60) ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ కలహాల కారణంగా మహమూద్‌ఖాన్ కొంత కాలంగా నల్గొండ చౌరస్తాలోని ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి చాదర్‌ఘాట్‌లోని న్యాగ్రా హోటల్‌లో భోజనం చేసి మహమూద్‌ఖాన్ తిరిగి నడుచుకుంటూ మలక్‌పేట నల్గొండ చౌరస్తాకు వెళ్లేందుకు చాదర్‌ఘాట్ చౌరస్తాలో రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో సూర్యాపేట నుంచి నగరానికి వస్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహమూద్ ఖాన్‌ను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసును ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు మహమూద్‌ఖాన్

రేపటి నుంచి మల్లన్నస్వామి ఉత్సవాలు ప్రారంభం

- మూడు రోజుల పాటు నిర్వహణ

సైదాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ మాతామైదానంలోని విజయదుర్గామాత ఆలయంలో మల్లన్నస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ వేడుకలు ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ప్రారంభం రోజు మంగళవారం సాయంత్రం పుట్టపూజ గంగతెప్ప కార్యక్రమం. బుధవారం ఉదయం చండీహోమం, శ్రీవిజయదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సదర్ పట్నం, సాయంత్రం మల్లన్నస్వామి ఊరేగింపు, గురువారం బోనాలు, వడిబియ్యం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ ప్రతినిధి సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



ముస్తాబైన విజయదుర్గామాత ఆలయం

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన వారితో పార్టీ రాష్ట్ర నేత శంకర్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ వార్డు సభ్యురాలు కాసోజు అర్పితారాధాకృష్ణతో పాటు పలువురు మహిళలు ఆదివారం బీజేపీ మీర్‌పేట్-1 అధ్యక్షుడు పి.భిక్షపతి చారి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. గతంలో బీజేపీలోనే కొనసాగిన అర్పిత గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి ఆదివారం సొంతగూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కీసరి గోవర్ధన్‌రెడ్డి, భీమ్‌రాజ్, హరినాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాధాకృష్ణ, హరిత, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాము కలకలం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం పాము కలకలం రేపింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాము ఉన్నట్లుగా గుర్తించిన మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ సురేష్ వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్‌కు సమాచారం ఇచ్చారు. ఇంతలో ఆయన అక్కడికి చేరుకుని మలక్‌పేట పీఎస్ ఆవరణలో ఉన్న పామును పట్టుకున్నాడు. దాన్ని పరిశీలించగా జెరిపోతు పాము అని గుర్తించారు. పట్టుకున్న పామును స్నేక్ సొసైటీకి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పామును పట్టుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్

కూలీ అనుమానాస్పద మృతి

- విచారణ జరిపించాలని సోదరి పోలీసులకు ఫిర్యాదు

సైదాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తమ సోదరుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి సోదరి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన కాసాని నారాయణ(42) నగరానికి వచ్చి కూలీ పనులు చేస్తూ సైదాబాద్ భానునగర్ కాలనీలో భార్య, పిల్లలతో నివాసముంటున్నాడు. శనివారం ఉదయం ఫోన్‌లో నారాయణ నాగారంలో ఉంటున్న అక్క లక్ష్మితో ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో వారి ఇంటి సమీపంలో ఉండే దగ్గరి బంధువు ఫోన్ చేసి నారాయణ మృతి చెందినట్లు అక్కకు సమాచారమందించాడు. నాగారంలో ఉండే అక్క లక్ష్మి వచ్చేలోపు ఎవరికి చెప్పకుండానే మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా మృతుడి భార్య స్వగ్రామం దేవరుప్పులకు తరలించింది. దీంతో తమ సోదరుడి మృతిపై అనుమానాలున్నాయంటూ సోదరి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజార్ చిరువ్యాపారులను ఆదుకోవాలి

వనస్థలిపురం : వనస్థలిపురం రైతుబజార్ చిరువ్యాపారుల అభ్యున్నతికి పరిసర కాలనీవాసులు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం రైతుబజార్ వద్ద చిరువ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రమోహన్ మాట్లాడుతూ గతంలో వనస్థలిపురం రైతుబజార్ వద్ద 130 కుటుంబాల చిరువ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించుకుంటు జీవనోపాధి కొనసాగించారన్నారు. ట్రాఫిక్ సమస్యలతో కొంత కాలంగా ఉన్న తోపుడు బండ్లను సంబంధిత అధికారులు తొలగించడంతో సదరు వ్యాపారులు తమ కుటుంబాలను పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో చిరువ్యాపారులు భారతమ్మ, చిన్న, శ్రీను, కోటేశ్వర్‌రావు, జయమ్మ, నర్సమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.



రైతుబజార్ వద్ద చిరువ్యాపారులతో మాట్లాడుతున్న చంద్రమోహన్



గడ్డిఅన్నారం బస్తీలోని కమ్యూనిటీహాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ హయత్‌నగర్ డిస్ట్రిక్ట్ 320 హెచ్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ విశ్వేశ్వరరావు, మాజీ గవర్నర్ గార్లపాటి జితేందర్, పక్కన లింగాల హరిగౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్ పటేల్, మడిగల లక్ష్మారెడ్డి తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి